సాక్షి చిత్తూరు
గురువారం । 14 । నవంబర్ । 2024



విద్యుత్ గ్రీవెన్స్‌కు 3 ఫిర్యాదులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌కు 3 ఫిర్యాదులు అందినట్లు ఈఈ తెలిపారు.



ఆగని ఏనుగుల దాడి

పులిచెర్ల :మండలంలోని మతుకువారిపల్లెలో రైతులు సాగు చేసిన పంటలపై ఏనుగులు దాడులు చేసి నష్టం కలిగించాయి.

ఏఎస్పీల నియామకం

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఏఎస్పీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం ఆదేశాలు జారీచేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న కె.జనార్దన్ నాయుడును తిరుపతి ట్రాన్స్‌కో ఏఎస్పీగా, అన్నమయ్య జిల్లాలో పని చేస్తున్న ఎస్ఆర్.రాజశేఖర్ రాజును చిత్తూరు ఏఎస్పీగా నియమించారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి అన్నదానం



సదుం: అయ్యప్పస్వామి ఆలయం

సదుం:కార్తీకమాసం ప్రారంభం అయితే అయ్యప్ప మాలధారణ చేసే వారు అధికంగా ఉంటారు. మాలధారణ చేసే వారితో పాటు, ఆలయ దర్శనానికి వచ్చే వారితో ఎర్రాతివారి పల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయం సందడిగా ఉంటుంది. భక్తుల సౌకర్యార్థం ఏటా నవంబరు నెల నుంచి జనవరి మకర సంక్రాంతి వరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో మూడు పూటలా అన్నప్రసాద వితరణ చేస్తారు. ఆనవాయితీ ప్రకారం శుక్రవారం నుంచి పూజా కార్యక్రమాలతో ఆలయంలో అన్నదానం ప్రారంభించనున్నట్లు ఆలయ మేనేజరు భాస్కర్ రాజు తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై నిర్లక్ష్యం వద్దు

- దాడులను ముమ్మరం చేయాలి
- ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు



మాట్లాడుతున్న డిస్కం విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు

తిరుపతి రూరల్: విద్యుత్ చౌర్యంపై దాడులను ముమ్మరం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ సూపరింటెండింగ్ ఇంజినీరు శ్రీనివాసబాబు హెచ్చరించారు. ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ కార్యాలయం విద్యుత్ భవన్‌లో బుధవారం తిరుపతి, చిత్తూరు విజిలెన్స్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా దాడులు, జరిమానాలపై ఆరా తీశారు. విద్యుత్ చౌర్యం ఎక్కడా జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు చౌర్యం జరుగుతున్న చోట మెరుపు దాడులను చేయాలని ఆదేశించారు. అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసి, మరీ వినియోగదారులకు తక్కువ ధరకే డిస్కం సరఫరా చేస్తుందని, అందువల్ల జీరో చౌర్యం దిశగా ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈసమావేశంలో విజిలెన్స్ విభాగం తిరుపతి జిల్లా ఈఈ గంగాధరరెడ్డి, చిత్తూరు జిల్లా ఈఈ షణ్ముగం, సిబ్బంది పాల్గొన్నారు.

19న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: ఈనెల 19వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సంకటహర గణపతి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రతం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటలకు స్వర్ణరథోత్సవం ఉంటుందని తెలిపారు. వ్రతంలో పాల్గొన్నే భక్తులు ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా సేవలను బుకింగ్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

భళా బాల..!



మైదానాల్లో కుస్తీ పడతారు. పుస్తకాలతో దోస్తీ కడతారు. కలలు కంటారు. కళల్లో ప్రావీణ్యం సాధిస్తారు. నాలుగు గోడల మధ్య పాఠాలు వింటారు. ప్రపంచం నలుదిశలా ప్రతిభ చాటుతారు. వారు చూస్తే పిల్లలు. కానీ ఔరా ! అనిపించే చిచ్చర పిడుగులు. క్రీడల్లో పతకాలు తమ వెంట పడేలా చేస్తారు. బొమ్మలు గీసి బాపును తలపిస్తారు. ఒకరు చదువులో ఔరా అనిపిస్తే.. ఇంకొకరు ఆటల్లో... మరికొందరు కళల్లో తమ ప్రత్యేకతను చాటుతున్నారు. పిన్న వయస్సుల్లోనే విభిన్న రంగాల్లో రాణిస్తూ తోటి చిన్నారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న చిన్నారులపై నేడు బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- నేడు జాతీయ బాలల దినోత్సవం
- చిన్నవయసులోనే అపార ప్రతిభ కనబరుస్తున్న చిన్నారులు
- శాస్త్రీయ నృత్యం.. గణితం.. క్రీడలు.. విభిన్న అంశాల్లో రాణిస్తున్న విద్యార్థులు
- అలవోకగా తెలుగు పద్యాలు చెప్పే టాలెంట్ వారి సొంతం
- పై విలువతో 600 దశాంశ స్థానాలను కళ్లకు గంతలు కట్టుకుని చెప్పడంలో ప్రావీణ్యం
- ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల్లోనే అపార మేధోసంపత్తి
- రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న వైనం
- ఎన్నో పతకాలు.. కీర్తి ప్రతిష్టలు వారి ప్రతిభకు తార్కాణం

చిత్తూరు కలెక్టరేట్ : ర్యాంకుల కోసం పరుగెత్తడం. ఒకరితో ఒకరు పోటీ పడడమే చదువుల లక్ష్యంగా మారిన తరుణంలో ఎంతోమంది చిన్నారులు చదువుతో పాటు నచ్చిన రంగంలో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. కొంతమంది విద్యార్థులు వైవిధ్యంగా, విభిన్నంగా ఆలోచిస్తున్నారు. క్రీడలు, తెలుగు పద్యాలు అలవోకగా చెప్పడం, అష్టావధానం, భరతనాట్యం ఇలా ఏ రంగమైనా సరే సృజనాత్మకతను సమున్నతంగా ఆవిష్కరిస్తున్నారు. వీరి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు ఉన్నారు.

గణిత అష్టావధానంలో మెరికలు..

జిల్లాలోని బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న రేవతి, పునిత్ సాయి, హేమ, లహరి గణిత అవధానంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. లెక్కల చిక్కుముడులు విప్పగలిగితే పరీక్షల్లో మార్కులు సాధించడం కష్టమేమి కాదు. గణితంపై మంగళపల్లి పాఠశాల విద్యార్థులు ఆసక్తిని పెంచుకుని పోటీతత్వం అలవరుచుకుంటున్నారు. ఇష్టంతో లెక్కలనుసాధన చేస్తున్నారు. గణిత ప్రజ్ఞాధారణ, మారథాన్, మ్యాథ్స్ ఫెస్ట్‌పై పట్టు సాధిస్తూ సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



గణిత అవధానంలో ప్రతిభ చాటిన మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

నృత్య దీపిక..



దీపిక

చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లికి చెందిన సతీష్‌బాబు, రబేక మేరి దంపతుల కుమార్తె దీపిక శాస్త్రీయ నృత్యంలో రాణిస్తోంది. ఏడో తరగతి చదువుతున్న ఈ అమ్మాయి భరతనాట్యం, కూచిపూడిలో గత ఐదేళ్లుగా శిక్షణ తీసుకుంటోంది. తిరుపతి, విజయవాడ, కాణిపాకం, చిత్తూరు తదితర చోట్ల నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. జిల్లాస్థాయిలో జరిగిన పలు ప్రముఖ కార్యక్రమాల్లో 22 బహుమతులను కైవసం చేసుకుంది. ఆమె నాట్యం చేస్తుంటే కళాభిమానుల కరతాళ ధ్వనులతో సభా ప్రాంగణం మార్మోగిపోతుంది.

కత్తి దూస్తే పతకం



రోహిత్

ఐరాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రోహిత్ సాఫ్ట్ బాల్, ఫెన్సింగ్ క్రీడల్లో ప్రతిభ చూపుతున్నాడు. తల్లిదండ్రులది వ్యవసాయ నేపథ్యం. చిన్నతనం నుంచి తల్లిదండ్రుల కష్టాలను చూస్తున్న రోహిత్ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నాడు. గత ఏడాది నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారుపతకం సాధించాడు. దేశ సేవ కోసం ఆర్మీలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని రోహిత్ అంటున్నాడు.

సాఫ్ట్‌బాల్‌లో దిట్ట..

ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ప్రకాష్ సాఫ్ట్‌బాల్ క్రీడలో దిట్ట. చిన్నతనం నుంచి క్రీడలంటే ఎంతో ఆసక్తి. తల్లి కూలి పనులు చేస్తూ ప్రకాష్‌ను చదివిస్తోంది. స్నేహితులతో కలిసి ఆటలు ఆడుతున్న సమయంలో ఇతని ప్రతిభను చూసిన ఫిజికల్ డైరెక్టర్ సాఫ్ట్‌బాల్‌లో శిక్షణ ఇచ్చారు. పాఠశాల స్థాయి నుంచి మండలం, జిల్లా, రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. గత ఏడాది కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. అదేవిధంగా సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీల్లో తలపడే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాడు.



ప్రకాష్

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ..



పృథ్వీ

సాధారణ కుటుంబం నుంచి వచ్చి.. గంగాధరనెల్లూరు మండలం మహదేవ మంగళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పృథ్వీ ఖోఖోలో కేక పెట్టిస్తున్నాడు. తండ్రి శంకరన్ మరణించారు. తల్లి జ్యోతి చిరుద్యోగి. ఆటల్లో పృథ్వీ ప్రతిభను గుర్తించిన తల్లి బాగా ప్రోత్సహించారు. బరిలో ఏ మాత్రం అలసిపోకుండా ఆడడంలో నేర్పరి ఇతను. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. అంతేకాకుండా మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

కళ్లకు గంతలు కట్టుకుని..



కళ్లకు గంతలు కట్టుకుని పై విలువులను చెబుతున్న విద్యార్థిని లహరి

బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న లహరి కళ్లకు గంతలు కట్టుకుని పై విలువను అవలీలగా చెబుతోంది. కేవలం నాలుగు నిమిషాల యాభై రెండు సెకెండ్లలో 600 దశాంశ స్థానాలను చెప్పగలుగుతోంది. క్రీస్తుపూర్వం 2000 ఏళ్ల క్రితమే పై విలువలపై పరిశోధనలు జరిగాయి. మన దేశానికి చెందిన ఆర్యభట్ట మొట్టమొదటి సారిగా పై విలువను నాలుగు దశాంశ స్థానాలకు సవరించి చెప్పారు. ప్రస్తుతం పై విలువ అంతం కానిది అని.. దీని విలువను 600 స్థానాలను కళ్లకు గంతలు కట్టుకుని చెప్పడమే కాకుండా ఆ విలువలతో యాదృచ్ఛిక విలువను సైతం చెప్పడం లహరి ట్యాలెంట్.

పద్యాల పూర్ణ



పూర్ణచంద్ర

జిల్లాలోని గంగవరం మండలం కీలపట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పూర్ణచంద్ర నాలుగో విద్యార్థి చదువుతున్నాడు. చదువులో బాగా చురుగ్గా ఉంటాడు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివే కొంతమంది పిల్లలు తెలుగు అంటేనే భయపడి పోతారు. కానీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఈ విద్యార్థి కథలు బాగా చెబుతున్నాడు. అలాగే 150 తెలుగు పద్యాలను అలవోకగా చెప్పగలుగుతున్నాడు. పలు పోటీల్లో పాల్గొని పథకాలను సైతం సొంతం చేసుకున్నాడు.

అలవోకగా 300 శతక పద్యాలు చెబుతూ..



ధ్యాన్‌చంద్

జిల్లాలోని సోమల మండలం సరస్వతిపురం మండల ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సాయి ధ్యాన్‌చంద్ అలవోకగా 300 శతక పద్యాలు చెబుతున్నాడు. వేమన, సుమతి, బద్దెన శతకాలలో 300 పద్యాలను ఏ మాత్రం తడుముకోకుండా చెప్పగలుగుతున్నాడు. నిత్య పారాయణ శ్లోకాలు 40 వరకు చెబుతున్నాడు. అతి చిన్న వయసులో ధ్యాన్‌చంద్ పద్యాలు, శ్లోకాలు, చిత్రలేఖనం, యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాడు.

లెక్కల్లో సాకేత్ వేరే లెవల్..

చిత్తూరు నగరానికి చెందిన సాకేత్‌రామ్ అనర్గళంగా లెక్కలు చకచక చెబుతున్నాడు. అతి చిన్న వయస్సు ఉన్న సాకేత్ అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో పాల్గొని రజక పతకం సాధించాడు. ఇటీవల కోల్‌కతాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పలు దేశాల విద్యార్థులు పాల్గొన్నారు. చిత్తూరు నుంచి పాల్గొన్న సాకేత్ రామ్ అడ్వాన్స్ లెవల్‌లో పాల్గొని రజక పతకాన్ని కైవసం చేసుకున్నాడు.



అంతర్జాతీ పోటీల్లో బహుమతి అందుకుంటున్న విద్యార్థి సాకేత్

మాకు రక్షణ కల్పించండి



నిరసనకారులతో చర్చిస్తున్న పోలీసులు

- తమకు జీవనాధారమైన కొండలను క్వారీలకు ఇచ్చేస్తారా ?
- రోడ్డుపై బైఠాయించిన కీళపట్టు గ్రామస్తులు
- న్యాయం చేసే వరకు ఆందోళన విరమించమని భీష్మించిన యువత

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు శివార్లలో ఉన్న కొండలను తవ్వేస్తున్నారని, తమకు జీవనాధారమైన అడవి, కొండ నాశనమవుతోందని పర్యావరణాన్ని రక్షించాలంటూ కొండ ప్రాంతానికి సమీప గ్రామాలకు చెందిన యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కీళపట్టు సమీపంలోని జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో చేశారు. పర్యావరణాన్ని రక్షించాల్సిన అధికారులు క్వారీలకు అనుమతిచ్చి ప్రజల జీవనాధారమైన కొండలు, అడవులు కోల్పోయేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తుల వద్ద ఎలాంటి చర్యలు జరపకుండా క్వారీలకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ వచ్చి తమకు సమాధానం చెప్పేంత వరకు రోడ్డు పైనుంచి లేవమంటూ భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి నిరసన కారులతో చర్చించారు. రాస్తారోకో చేయడంలో రోడ్డుపై వాహనాలు చాలా దూరం వరకు ఆగిందని పలువురికి ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. సమస్యను ఆర్డీఓ కార్యాలయం వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో నిరసనకారులు కీళపట్టు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు.

కొండలపై బాంబులు పేల్చుతున్నారు..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా ప్రజలకు జీవనాధారంగా నిలుస్తున్న కొండలు, అడవులు క్వారీల ద్వారా నాశనమవుతోందని ఆరోపించారు. కొండలపై బాంబులు పేలుతుంటే పశువులు ఎలా మేతకు వెళ్తాయన్నారు. స్థానికుల కోరిక మేరకు డీఆర్‌డీఓ నిర్వహించిన సదస్సులో కూడా తమ గ్రామస్తులంతా మైనింగ్ రద్దు చేయాలని కోరడం జరిగిందన్నారు. అయినా క్వారీ యాజమాన్యం రాజకీయ పలుకుబడితో క్వారీ నడుపుతోందని, క్వారీలను ఆపి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. అలా చేయకుంటే గ్రామస్తులు అందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నిరసన కారులు

చింటూ జీవిత ఖైదు కేసు కొట్టివేత

చిత్తూరు అర్బన్: చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబుపై జరిగిన హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడు చంద్రశేఖర్ అలియాస్ చింటూకు జిల్లా కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను కొట్టేస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం తీర్పునిచ్చింది. 2005 డిసెంబర్ 31న సీకే బాబు కట్టమంచిలోని ఇంటి నుంచి బయలుదేరగా వినాయకుడి ఆలయం వద్ద మందు పాతర పేల్చారు. ఘటనలో సీకే బాబు ప్రాణాలతో బయటపడగా.. గన్‌మెన్ సురేంద్ర చనిపోగా, ఎనిమిది మంది గాయపడ్డారు. కేసును విచారించిన చిత్తూరు 9వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టు చింటూను దోషిగా తేలుస్తూ 2018 మార్చిలో అతనికి జీవిత ఖైదు విధించింది. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో కింది కోర్టు ఇచ్చిన శిక్షను కొట్టేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖలతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం పకడ్బందీగా అమలు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ శాఖలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేస్తే గర్భిణుల ఆరోగ్య సంరక్షణతో పాటు మాతా శిశు మరణాల నివారణ సులభతరం అవుతుందని తెలిపారు. బాల్యవివాహాల కట్టడికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని, చిన్న వయస్సులో పెళ్లి చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై సత్వరం స్పందించాలి

ప్రజల సమస్యలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు సత్వరం స్పందించి న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల్లో రెవెన్యూ శాఖ కీలకమైందని, ఆ శాఖ అధికారులు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. నిర్ణీత గడువులోపు వెబ్‌ల్యాండ్ కరెక్షన్లు, మ్యూటేషన్లకు అందే దరఖాస్తులను రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. జేసీ విద్యాధరి మాట్లాడుతూ వీఆర్ఏ, వీఆర్‌ఓల విధులకు సంబంధించి డివిజన్ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

స్క్రీనింగ్‌తోనే క్యాన్సర్‌పై విజయం

క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమని, అందుకే జిల్లావ్యాప్తంగా ప్రజలందరికీ గురువారం నుంచి ఇంటి వద్దనే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ పరీక్షలు, న్యూమోనియా కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో 18 ఏళ్లు నిండిన ప్రజలందరికీ క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు.

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 108 ఉద్యోగులు ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి సమ్మె నోటీసు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థలను మార్చిన ప్రతి పర్యాయం గ్రాట్యూటీ, ఈఎల్ నగదు, వార్షిక ఇంక్రిమెంట్‌లు చెల్లించకుండా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగులుగా గుర్తించి 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2017లో జారీచేసిన జీఓ నంబర్ 49ని అమలు చేయాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు విద్యార్హతలను సడలించాలని సూచించారు. 108లోని ఈఎంటీల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని డీఎంఈ మెడికల్ కాలేజీలో ఈఎంటీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏఈఎంఎస్ సంస్థ 108 నిర్వహణ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతి నెలా జీతాల చెల్లింపును ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నేతలు కోమల, కిరణ్, జ్ఞానశేఖరన్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న 108 సిబ్బంది